క్లుప్తంగా

అర్ధవీడు ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడులోని ఎమ్మార్సీకి మొదటి విడతగా 15,426 పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ–2 మేఘావత్ లక్ష్మీనాయక్ తెలిపారు. పాఠ్య పుస్తకాలను తరగతుల వారీగా సీఆర్పీలతో విభజిస్తున్నట్లు చెప్పారు. రెండో విడత పాఠ్య పుస్తకాలు వచ్చిన తర్వాత పాఠశాలలకు అందజేస్తామని పేర్కొన్నారు.

చిల్లచెట్లతో వాహనదారులకు అవస్థలు



రోడ్డు మీదకు వచ్చిన చిల్లచెట్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్ రోడ్డులో ఒక వైపు చిల్లచెట్లు ఏపుగా పెరగడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం , మరో వైపు చిల్లచెట్లు కమ్మేయడంతో జగనన్న కాలనీ వాసులు, కొంగలవీడు అంకాలమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు, కొంగలవీడు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు వెంట చిల్లచెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల్లో ఉచిత సీట్లకు 19 వరకు గడువు

కొమరోలు: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో కేటాయించిన 25 శాతం సీట్లకు ఈనెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు సూచించారు. అర్హులైన విద్యార్థులను గ్రామ సచివాలయాల్లో ఎంపిక చేసి ఈనెల 29వ తేదీన తొలి విడత అర్హుల జాబితా ప్రకటిస్తారని, జూన్ 11వ తేదీన రెండో విడత అర్హుల జాబితా ప్రకటిస్తారని వివరించారు. సీటు పొందిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

హెల్మెట్‌ను భారంగా భావించొద్దు

- మార్కాపురం డీఎస్పీ నాగరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: టూవీలర్‌పై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని డీఎస్పీ యు.నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కంభం సెంటరులో హెల్మెట్ వాడకంపై పోలీసు అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అనుకోకుండా రోడ్డు ప్రమాదం సంభవిస్తే హెల్మెట్ రక్షణగా ఉంటుందన్నారు. హెల్మెట్‌కు తలకు భారంగా భావించవద్దని చెప్పారు. హెల్మెట్ లేనివారికి భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి ఓవర్‌టేక్ చేయడం, వేగంగా వెళ్లడం యువతకు మంచిది కాదన్నారు. డీఎస్పీ వెంట సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు తదితరులు ఉన్నారు.



రాచర్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆదిశేషయ్య, పోలీసులు సురేష్, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర పూజలు, కుంకుమ పూజ చేశారు.



పీవీపురం గ్రామంలో ఇదీ పరిస్థితి





జెన్నివారిపల్లెలో మెయిన్ రోడ్డు, అంతర్గత రోడ్ల దుస్థితి

పల్లెటూరు.. దోమల హోరు!

- బేస్తవారిపేట మండలంలోని పలు గ్రామాల్లో దారుణంగా పారిశుధ్యం
- ప్రధాన, అంతర్గత రహదారులపై నెలల తరబడి మురుగు నిల్వ
- డ్రెయినేజీలు లేక, ఉన్నా పూడిక తీయకపోవడమే కారణం
- డెంగీపై అవగాహన సదస్సుల పేరుతో అధికార యంత్రాంగం హడావుడి
- క్షేత్ర స్థాయిలో ప్రజలపై దండయాత్ర చేస్తున్న దోమలు



వంగపాడులో సీసీ రోడ్డుపై ఇలా..



బేస్తవారిపేటలో ఏడాదిగా పూడిక తీయని డ్రెయినేజీ



బేస్తవారిపేటలో డ్రెయినేజీ లేక పాచిపట్టిన సీసీరోడ్డు

బేస్తవారిపేట: 'దోమలు పుట్టకూడదు.. కుట్టకూడదు, డెంగీ అంతం.. మన పంతం, దోమ తెరలు వాడండి, పొడుగు చేతుల చొక్కాలు వేసుకోండి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి' ఇవీ తరచూ అవగాహన సదస్సుల్లో అధికార యంత్రాంగం చెప్పే మాటలు. కానీ క్షేత్ర స్థాయిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులు చేపడుతున్న చర్యలేమిటో వారికే తెలియాలి. గ్రామాల్లో గుప్పెడు బ్లీచింగ్ చల్లించాలన్న విషయాన్ని కూడా పాలకులు పట్టించుకోవడం లేదంటే ప్రజారోగ్యంపై వారికున్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా బేస్తవారిపేట మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించగా మురుగు కూపాలు దర్శనమిచ్చాయి. బేస్తవారిపేట మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు సైతం మురుగు కూపాలుగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్నప్పటికీ నిర్వహణ లోపం కారణంగా గృహాల్లోంచి వచ్చే మురుగుతోపాటు చిన్నపాటి వర్షం పడినా ఆ నీరంతా రోడ్లపై నిల్వ ఉంటోంది. వారాల తరబడి నీరు నిల్వ ఉండటంతో పాచిపట్టి దుర్వాసన వస్తోంది. అదే సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

- మండలంలోని పీవీ పురంలో అంతర్గత సీసీ రోడ్డు జెన్నివారిపల్లెకు వెళ్లే మెయిన్ రోడ్డు కన్నా ఎక్కువ ఎత్తులో నిర్మించారు. దీంతో మురుగు మొత్తం సీసీ రోడ్డుపై చేరి మురుగుమయంగా మారుతోంది.
- జెన్నీవారిపల్లె గ్రామంలోకి వెళ్లే మెయిన్ రోడ్డు దారుణంగా తయారైంది. కనీసం అడుగుతీసి అడుగు పెట్టే పరిస్థితి లేకుండాపోయింది. పేరుకేమో సీసీ రోడ్డు.. కానీ మురుగు తటాకంగా తయారైంది. డ్రైనేజీ లేకపోవడంతో పైఎత్తు నుంచి మురుగు వచ్చి సీసీ రోడ్డు వాలు తక్కువగా ఉన్న చోట నిల్వ ఉంటోంది. దీనికి వర్షం నీరు తోడవడంతో మురుగు తటాకాన్ని తలపిస్తోంది. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- కోనపల్లెకు వెళ్లే బీటీ రోడ్డు అక్కపల్లె బస్టాండ్ ఆవరణలో లోతట్టుగా ఉండటంతో వర్షం నీరు నిల్వ ఉంటోంది. నెలల తరబడి నీరు అలాగే ఉండటంతో బీటీ రోడ్డు ఛిద్రమై గుంతలమయంగా మారింది. డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డు వెంబడి ఉన్న గృహాల నుంచి వచ్చే వ్యర్థ నీరు, వర్షం నీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- వంగపాడులోని రామాలయం వద్ద రోడ్డు నిత్యం బురదమయంగా తయారవుతోంది. రోడ్డు పక్కన తొట్టిలోకి నీరు నింపుతున్నారు. పశువులకు, గృహ అవసరాలకు గ్రామస్తులు నీటిని పట్టుకుని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తొట్టి నిండి వృథా నీరు రోడ్డుపైకి చేరుతోంది.
- మండల కేంద్రమైన బేస్తవారిపేటలో పలు వీధుల్లో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడంతో మురుగు ముందుకు కదలక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దుర్వాసనతోపాటు దోమలు విజృంభిస్తున్నాయి. పంచాయతీ అధికారులు అప్పుడప్పుడూ మొక్కుబడిగా పూడికతీత, ఫాగింగ్ చేయిస్తూ చేతులు దులుపుకొంటున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



ఉప్పలపాడులో డెంగీపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ శ్రవణ్‌తేజ, వైద్య సిబ్బంది

మార్కాపురం టౌన్: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ పి.శ్రవణ్‌తేజ ప్రజలకు సూచించారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో మార్కాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రిపూట దోమతెరలు వాడాలని సూచించారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసరు ఆర్.నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల ముందు మురుగు, చెత్తా చెదారం నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మురుగు కాల్వల్లో దోమలు పెరగకుండా మలాథియాన్ ఆయిల్ పిచికారీ చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో దోమలు ఇళ్లలోనికి రాకుండా వేపాకు పొగ వేయాలని చెప్పారు. డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నవారు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆవులయ్య, గోవిందరాజులు, పి.లక్ష్మీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పొదిలి రూరల్: ప్రజలు తాము నివాసం ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుగుణకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఉప్పలపాడులో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ సుగుణకుమార్ మాట్లాడుతూ..

తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, కంటి కదలిక తగ్గడం, దాహం, నోరు ఎండిపోవడం లాంటి లక్షణాలు డెంగీ సోకిన వారిలో ఉంటాయని చెప్పారు. దోమల నుంచి రక్షణకు దోమతెరలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ లేళ్ల శ్రీనివాసరెడ్డి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు రూరల్: డెంగీ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక నంద్యాల రోడ్డులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భార్గవ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కోటగడ్డ వీధిలో శుక్రవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ వ్యాధితో కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలకు వివరించారు. డెంగీకి వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డిజైన్ స్లేట్ కార్మికుల కూలి ధర పెంచాలి



ధర్నా చేస్తున్న డిజైన్ స్లేట్ కార్మికులు

మార్కాపురం: డిజైన్ స్లేట్ కార్మికుల కూలి ధరలను వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్లేట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టేట్‌లోని ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. రఫీ మాట్లాడుతూ.. పాత కూలి రేట్ల ఒప్పందం ముగిసినా, ధర పెంచకుండా యాజమాన్యం కాలయాపన చేయడం సరికాదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా కూలీలకు ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. రెండు దఫాలుగా నిర్వహించిన చర్చల్లో తమ డిమాండ్లను యాజమాన్యాలకు తెలిపినా కొద్ది మొత్తంలో మాత్రమే పెంచుతామని చెప్పడం అన్యాయమన్నారు. ఓనర్స్ అసోసియేషన్ తరఫున వెన్నా పోలిరెడ్డి, రమేష్‌రెడ్డి, గుప్తా ప్రసాద్ తదితరులతో కూలి ధరల పెంపుపై చర్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రూబెన్, రాములు, ప్రకాశం, శేషగిరి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాహిమాం లక్ష్మీనారసింహా



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో 13వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉభయదాతలుగా త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి గ్రామానికి చెందిన పలువురు దంపతులు వ్యవహరించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. శనివారం రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వేముల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

సేంద్రియ ఎరువులతో భూమికి రక్ష



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

కొమరోలు: విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వినియోగిస్తే నేల ఆరోగ్యం దెబ్బతింటుందని గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. మండలంలోని రౌతుపల్లె గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. భావితరాలకు ఆరోగ్యవంతమైన భూములివ్వాల్సిన అవసరముందన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. భూమి ఆరోగ్య పరిరక్షణకు రైతులు సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలని, సమగ్ర పోషక యాజమాన్యం చేపడితేనే అధిక దిగుబడి వస్తుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ రాజశ్రీ, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో డీప్ బోరు ఏర్పాటు



బీసీ కాలనీలో బోరు వేస్తున్న దృశ్యం

తర్లుపాడు: గత కొద్దిరోజులుగా స్థానిక బీసీ కాలనీలో నీటిసమస్య ఏర్పడటంతో పంచాయతీ నిధులతో సర్పంచ్ పి.వరాలు నూతన బోరు వేయించారు. ముందుగా ఎంపీపీ భూలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు అంకమ్మ, స్థానిక నేతలు హాజరై భూమి పూజ చేశారు. వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు ప్రభాకర్, కాలంగి శ్రీను, ఈర్ల వెంకటయ్య, వెలుగు కాశీరావు, తదితరులు పాల్గొన్నారు. నూతన బోరు ఏర్పాటుతో బీసీ కాలనీలో నీటి సమస్య తీరుతుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



పుష్కర యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం, కమిషనర్ తదితరులు

మార్కాపురం: తెలంగాణలో మొదలైన సరస్వతీ పుష్కరాలకు మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని డీఎం ఏఎస్ నరసింహులు తెలిపారు. పుష్కర యాత్రపై ఆర్టీసీ ముద్రించిన కరపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎన్‌జీఓ సంఘ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి, వి.శ్రీనివాస్‌తో కలిసి డీఎం శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, పుష్కర స్నానంతోపాటు కాళేశ్వరం, రామప్పదేవాలయం, వరంగల్ భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి తదితర ప్రాంతాలను దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి టిక్కెట్ ధర రూ.1900గా నిర్ణయించామని, వసతి, భోజన ఖర్చులు యాత్రికులే భరించాలని స్పష్టం చేశారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యజ్ఞోపవీతం సాయిసన్నిధి పత్రిక ఎడిటర్ ఓఏ మల్లిక్, సాయిబాబా మందిర కార్యదర్శి జి. హరిహరరావు, టీఎస్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో దివ్యాంగులకు ఇబ్బందులు

మార్కాపురం: స్థానిక జీజీహెచ్‌లో సదరం వెరిఫికేషన్‌కు వస్తున్న దివ్యాంగులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకుని ఇబ్బందులను తొలగించాలని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు కోరారు. శుక్రవారం ఆయన జీజీహెచ్‌లో దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించి విలేకర్ల దృష్టికి తెచ్చారు. కంభం, బేస్తవారిపేట తదితర ప్రాంతాల నుంచి పలువురు దివ్యాంగులు జీజీహెచ్‌కు వస్తున్నారని, మంచినీటి సౌకర్యం, ఫ్యాన్ లేకపోవడంతో దివ్యాంగులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా అవస్థలు పడుతున్నారని వివరించారు.

జీజీహెచ్‌లో విజయవంతంగా యాంజియోప్లాస్టి ఆపరేషన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గుండె జబ్బుతో బాధపడుతున్న ఒక రోగికి యాంజియోప్లాస్టీ ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కుంచాల వెంకటేశ్వరరావు ఆ వివరాలు వెల్లడించారు. గుండెజబ్బుతో బాధపడుతున్న ప్రసాద్ జీజీహెచ్‌లో కార్డియాలజీ విభాగాన్ని సంప్రదించారు. అతడికి యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించి గుండె కుడివైపు రక్తనాళాల్లో ఆటంకాలు ఉన్నట్లు గుర్తించారు. రోగికి వివరాలు తెలియజేసి స్టెంట్ వేసి ప్రాణాలు రక్షించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జీజీహెచ్‌లో ఎన్నో అరుదైన ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ ప్రారంభించాక చేసిన తొలి ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్నారు. ఆపరేషన్ చేసిన చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈ ఆపరేషన్‌ను పూర్తి ఉచితంగా చేసినట్లు చెప్పారు. అదే ప్రైవేటు వైద్యశాలలో చేయాలంటే కనీసం 2 లక్షల రూపాయలు ఖర్చవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కిరణ్‌కుమార్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు ప్రాణ సంకటం



పొదిలి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గుంతలో పడిన వాహనం

పొదిలి రూరల్: అధికారుల నిర్లక్ష్యం ఓ యువకుడికి ప్రాణపాయాన్ని తెచ్చిపెట్టింది. పొదిలి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇటీవల సాగర్ పైప్‌లైన్ మరమ్మతుల కోసం గుంత తీశారు. పనులు పూర్తయిన తరువాత గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. శుక్రవారం విశ్వనాథపురం నుంచి పెదబస్టాండ్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు ఆసుపత్రి వద్ద ఉన్న గుంత కనిపించక.. వాహనంతో సహా అందులో పడిపోయాడు. యువకుడు స్వల్ప గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు స్పందించి యువకుడితోపాటు వాహనాన్ని బయటకు తీశారు.